• రుణమాఫీ చేయాలని రైతుల ధర్నా

కొర్రీలు పెట్టకుండా అర్హులైన రైతులందరికి రుణమాఫీ వర్తింపజేయాలని డిమాండ్ చేస్తూ ఏఐకేఎస్ ఆధ్వర్యంలో భద్రాద్రి కలెక్టరేట్ ఎదుట బుధవారం రైతులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం నేతలు ముత్యాల విశ్వనాథం, చంద్ర నరేంద్రకుమార్ మాట్లాడుతూ.. రైతుల రుణాలు మాఫీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం షరతులు విధించడం సరికాదన్నారు.
– కొత్తగూడెం అర్బన్

• బ్యాంకు వద్ద రైతుల నిరసన

ములుగు జిల్లా ఏటూరునాగారంలోని కెనరా బ్యాంకు వద్ద రైతులు బుధవారం ధర్నా చేపట్టారు. బ్యాంకులో సరిపడా సిబ్బంది లేకపోవడంతో తాము ఇబ్బంది పడుతున్నామని, ఉన్నవారు సరిగా స్పందించడం లేదంటూ రైతులు వాపోయారు. రుణాల మాఫీ, కొత్త రుణాలు తీసుకోవడం, బంగారంపై పంట రుణాలు తీసుకునేందుకు వస్తే ఉద్యోగులు అందుబాటులో లేకపోవడంతో తరచూ తిరగాల్సి వస్తుందని ఆగ్రహం వ్యక్తంచేశారు.
– ఏటూరునాగారం

• రుణమాఫీ తిప్పలు..

రుణమాఫీ డబ్బులు తీసుకునేందుకు, రెన్యువల్ చేసుకునేందుకు రైతులు తిప్పలు పడుతున్నారు. 20 రోజులుగా ఆడిట్ పేరుతో ఆలస్యం కావడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. బుధవారం మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేటలోని ఎస్‌బీఐకి పెద్ద సంఖ్యలో రైతులు రావడంతో గేట్లు మూసివేశారు. దీంతో రైతులు అక్కడే గుమికూడారు. కొందరు బయటకు వచ్చాక మరికొందరిని లోపలికి అనుమతించారు.
– నర్సింహులపేట

మంత్రి సొంతూర్లో రుణమాఫీ పెద్ద 'దగా'డ

- జూపల్లి స్వగ్రామంలో అసంపూర్తిగా మాఫీ
- 1,780 మందికిగానూ 1,170 మందికే వర్తింపు
- ఇంకా 40 శాతం మందికి మాఫీకాని రుణాలు
- కాంగ్రెస్ సర్కారుపై మండిపడుతున్న అన్నదాతలు

మంత్రి జూపల్లి కృష్ణారావు సొంతూరు వనపర్తి జిల్లాలోని పెద్దదగడ గ్రామం

జూపల్లి ఇలాకా.. రైతుకు ధోకా

వనపర్తి, ఆగస్టు 28 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం రైతులందరికీ రూ.2 లక్షల వరకు ఉన్న రుణాలన్నీ మాఫీ చేశామని చెప్తున్నా.. ఎక్కడా పూర్తిస్థాయిలో మాఫీ అయిన దాఖలాలు కనిపించడం లేదు. అందుకు పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సొంత గ్రామంలో జరిగిన రుణమాఫీ తీరే ఉదాహరణ. వనపర్తి జిల్లా చిన్నంబావి మండలం పెద్దదగడలో మొత్తం 2,194 మంది రైతు కుటుంబాలున్నాయి. ఈ గ్రామానికి చెందిన రైతులు కొప్పునూరు సహకార సంఘం, పెంట్లవెల్లి మండలం జటప్రోల్ యూనియన్ బ్యాంకుల ద్వారా పంట రుణాలు తీసుకున్నారు. కొప్పునూరు సంఘంలో 180 మంది క్రాప్‌లోన్లు తీసుకుంటే.. వీరిలో 120 మందికి మాత్రమే మాఫీ వర్తించింది. పెంట్లవెల్లి మండలం జటప్రోల్ యూనియన్ బ్యాంక్ నుంచి 1,600 మంది రుణం పొందితే.. వీరిలో 1,050 మందికి మాఫీ అయ్యింది. ఇంకా 550 మందికి రుణాలు మాఫీ కాలేదు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇలా గ్రామంలో రుణాలు తీసుకున్న మొత్తం రైతులు 1,780 మంది ఉంటే.. 1,170 మందికి మాత్రమే మాఫీ వర్తించిందని వ్యవసాయ శాఖ లెక్కలు చెప్తున్నాయి. దీని ప్రకారం.. పెద్దదగడలో ఇంకా దాదాపు 40 శాతం రైతులకు పంట రుణాలు మాఫీ కావాల్సి ఉంది. వ్యవసాయ కార్యాలయాలు, బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నప్పటికీ వారి బాధలు తొలగడం లేదు. అన్ని అర్హతలు ఉండి కూడా మాఫీ రాని రైతుల పాట్లు రోజురోజుకూ ఎక్కువవుతున్నాయి. రేషన్ కార్డులు లేవని, ఆధార్‌లో తప్పులున్నాయని కొందరి పేర్లు లిస్టులో లేకపోవడంతో.. రుణమాఫీ పెద్ద దగా అంటూ రైతులు మండిపడుతున్నారు.

మాఫీ చేయలే..

నాకు ఎకరా 20 గుంటల భూమి ఉంది. దీనిపై 50 వేల పంట రుణం తీసుకున్నా. మాఫీ లిస్టులో నా పేరు రాలేదు. బ్యాంకులో అడిగితే మీ తండ్రి పేరుతో కూడా రుణం ఉందంటున్నారు. ఇద్దరిది కలిపి రూ.2.08 లక్షలని చెప్తుండ్రు. ప్రభుత్వం రూ.2 లక్షలిస్తే.. రూ.8 వేలు మేము కట్టుకుంటం. అధికారుల చుట్టూ తిరిగి అలసిపోతున్నాం. మా బాధలు అర్థం కేసుకుని రుణమాఫీ చేయండి.
-కంచి శివ, యువ రైతు, పెద్దదగడ

వస్తే ఇస్తాం అంటున్నరు

నాకు ఆరెకరాల పొలం ఉంది. 2 లక్షల రుణం తీసుకున్నా. మాఫీ లిస్టులో నా పేరు లేదు. ఎందుకు లేదని సొసైటీ వద్దకు వెళ్లి అడిగితే.. లిస్టులో వస్తే ఇస్తాం.. రాలేదు అంటున్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్తే.. దరఖాస్తు చేసుకోవాలంటున్నారు. ఈ గోస మాకు అర్థం కావడం లేదు. మీరు చెప్పిన 2 లక్షల మాఫీ చేస్తే.. మాకు ఇదంతా దండగ ఉండదు. మాఫీ చేస్తామని చెప్పి చివరకు మా కడుపులో మంటలు పెట్టింది కాంగ్రెస్ ప్రభుత్వం.
-బాలీశ్వరయ్యగౌడ్, రైతు, పెద్దదగడ

మళ్లీ దరఖాస్తు చేసుకోవాలట

నాకు ఐదెకరాల 12 గుంటలున్నది. జటప్రోల్ బ్యాంకులో రూ.1.75 లక్షల రుణం తీసుకున్నా. మాఫీ లిస్టులో నా పేరు లేదు. అధికారులను అడిగితే మళ్లీ దరఖాస్తు చేసుకోవాలంటున్నారు. మేమూ రైతులమే.. మాకూ అప్పు ఉంది. ఒక ఊరిలోనే ఇలా ఇన్ని తేడాలు చూపుతున్నారు. 2 లక్షల వరకు మాఫీ అన్నరు. అది చేస్తే మిమ్మల్ని మళ్లా అడుగుతామా? ఈ సర్కారు చేసేది ఒకటి.. చెప్పేది మరోటి అన్నట్టు ఉంది. -చేపల సహదేవుడు, పెద్దదగడ గ్రామం

రేషన్‌కార్డు లేనివారికీ రుణమాఫీ

- రాజన్న ఆలయంలో కార్తీకమాసం నుంచే నిత్యాన్నదానం
- మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి

వేములవాడ, ఆగస్టు 28: రేషన్‌కార్డు లేని రైతులందరికీ రూ.2 లక్షల లోపు రుణాలు మాఫీ చేస్తామని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టంచేశారు. బుధవారం ఆయన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి వేములవాడలో రూ.15 లక్షలతో నిర్మించిన సహకార సంఘం గోదాం, రూ.80.66 లక్షలతో నిర్మించిన కేడీసీసీ బ్యాంక్ భవనాన్ని ప్రారంభించారు. తర్వాత ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 59 వేల మంది రైతులకు రూ.444 కోట్ల రుణాలు మాఫీ చేశామని తెలిపారు. రేషన్‌కార్డు లేనివారికి ప్రభుత్వం కుటుంబ నిర్ధారణ ప్రారంభించిందని, అధికారులు విచారణ చేసిన తర్వాత వారికి కూడా రుణమాఫీ అవుతుందని భరోసా ఇచ్చారు. రాజన్న ఆలయంలో నిత్యాన్నదాన కార్యక్రమాన్ని వచ్చే కార్తీకమాసం నుంచి ప్రారంభిస్తామని మంత్రి పొన్నం తెలిపారు.

గురుకుల విద్యార్థులను కరిచిన ఎలుకలు

నల్లగొండ జిల్లాలో ఆలస్యంగా వెలుగులోకి

దేవరకొండరూరల్, ఆగస్టు 28: నల్లగొండ జిల్లాలోని గురుకుల వసతి గృహ విద్యార్థులను ఎలుకలు భయపెడుతున్నాయి. నాలుగు నెలల క్రితం డిండి బీసీ గురుకుల బాలిక వసతి గృహ విద్యార్థినులు ముగ్గురిని ఎలుకలు కొరకగా.. తాజాగా మరో ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. దేవరకొండ మండలం కొండభీమనపల్లి శివారులో గల ఖాదర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఉన్న బీసీ గురుకుల బాలుర పాఠశాలలో నిద్రిస్తున్న 13 మంది విద్యార్థులను సోమవారం రాత్రి ఎలుకలు కరిచాయి. ఈ విషయాన్ని నిర్వాహకులు గోప్యంగా ఉంచారు. ఎలుకలు కరిచిన విషయాన్ని విద్యార్థులు.. ఉపాధ్యాయుడు, హెల్త్ సూపర్‌వైజర్‌కు చెప్పడంతో దగ్గరలో ఉన్న తూర్పుపల్లి పీహెచ్‌సీలో వైద్యం చేయించారు. ఆ విద్యార్థులకు ఏఆర్‌వీ ఇంజక్షన్ ఇచ్చినట్టు తల్లిదండ్రులు తెలిపారు. వసతి గృహం పరిసరాలు పరిశుభ్రంగా లేక ఎలుకలు విపరీతంగా ఉన్నాయని విద్యార్థులు వాపోతున్నారు.

రుణమాఫీ కాకపోతే రైతే బాధ్యుడా?

- కుటుంబ నిర్ధారణ ఉద్దేశం ఇదేనా?
- రైతు సంఘాల సందేహాలు
- కుటుంబాన్ని ధ్రువీకరిస్తేనే మాఫీ
- ఐటీ చెల్లిస్తే రుణమాఫీ బంద్
- రేషన్‌కార్డు లేని 2 లక్షల మందికి కోత
- సీఎం లెక్కల్లో రేషన్‌కార్డు లేనివారు 6.36 లక్షలు
- కుటుంబ సర్వే చేస్తున్నది 4.24 లక్షల మందికే

హైదరాబాద్, ఆగస్టు 28(నమస్తే తెలంగాణ): రుణమాఫీ కాకపోవడానికి రైతులనే బాధ్యులను చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదా? ఇందుకోసమే కుటుంబ నిర్ధారణ సర్వే చేపడుతున్నదా? రైతు తెలిపిన వివరాల ప్రకారం ఆ రైతుకు రుణమాఫీ కాకపోతే వారినే బాధ్యులుగా చేయనున్నారా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. కుటుంబ నిర్ధారణ కోసం చేపట్టిన సర్వేపై రైతు సంఘాలు అనుమానాలు వ్యక్తంచేస్తున్నాయి. రేషన్‌కార్డు లేని రైతులకు రుణమాఫీ చేసేందుకు ప్రభుత్వం కుటుంబ నిర్ధారణ చేపట్టింది. బుధవారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక యాప్ ద్వారా సర్వేను ప్రారంభించింది. క్షేత్రస్థాయి అధికారులు ఎంపిక చేసిన రైతుల వద్దకు వెళ్లి ఆ రైతు కుటుంబసభ్యుల వివరాలను సేకరించనున్నారు. కుటుంబ సభ్యుని పేరు, ఆధార్ నంబర్, వయసు, కుటుంబ పెద్దతో సంబంధం వివరాలను సేకరించనున్నారు. ఈ ఫారంపై రైతుతో సంతకం కూడా చేయించుకుంటున్నారు. దీని మీద సంతకం పెడితే తాను ఇచ్చిన వివరాలన్నీ సరైనవేనని, తప్పుడు వివరాలతో రుణమాఫీ పొందితే అందుకు తానే పూర్తి బాధ్యత వహిస్తానని రైతు ఒప్పుకొన్నట్టే. రుణమాఫీ సొమ్మును రికవరీ చేసేందుకు కూడా అంగీకరించినట్టే. కుటుంబ సభ్యులందరి ఆధార్ వివరాలను ప్రభుత్వం సేకరిస్తున్నది. ఆయా ఆధార్ నంబర్లకు రుణమాఫీ నిబంధనలను అమలుచేస్తుంది. కుటుంబంలో ఏ ఒక్కరైనా ఆదాయపన్ను చెల్లిస్తే.. ఆ కుటుంబం మొత్తానికి రుణమాఫీ అమలు కాదు. దీనిపై రైతులు ప్రశ్నించడానికి కూడా వీలులేదు. ఎందుకంటే ఆ రైతే అన్ని వివరాలను ఫారంలో రాసి సంతకం పెట్టారు కాబట్టి. ఈ విధంగా సర్వే ద్వారా రుణమాఫీ కాకపోతే రైతులు గోల చేయకుండా, ప్రభుత్వాన్ని నిందించకుండా వారి చేతులు వారిపైనే పెట్టే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తున్నదనే విమర్శలొస్తున్నాయి. రుణమాఫీ కాని రైతులు ప్రశ్నించకుండా వాళ్లనే బాధ్యుల్ని చేసే వ్యూహాన్ని ప్రభుత్వం అనుసరిస్తున్నదని రైతు సంఘాలు అభిప్రాయపడుతున్నాయి.

సీఎం చెప్పిన లెక్కకు చేస్తున్న లెక్కల్లో తేడా

రుణమాఫీకి సంబంధించి రేషన్‌కార్డు లేని రైతుల లెక్కలోనూ ప్రభుత్వం కోతలు పెడుతున్నది. మొదట సీఎం చెప్పిన లెక్కకు, ఇప్పుడు కుటుంబ నిర్ధారణ చేస్తున్న లెక్కకు పొంతన లేకపోవడంతో రైతు సంఘాలు అనుమానం వ్యక్తంచేస్తున్నాయి. మొదటి విడత రుణమాఫీ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. రేషన్‌కార్డు లేని 6.36 లక్షల మందికి తర్వాత కుటుంబ నిర్ధారణ చేసి రుణమాఫీ చేస్తామని వెల్లడించారు. కానీ ప్రభుత్వం ప్రస్తుతం చేస్తున్న కుటుంబ సర్వేలో 4.24 లక్షల మంది రైతులను మాత్రమే చూపిస్తుండటం అనుమానాలకు తావిస్తున్నది. సీఎం చెప్పిన లెక్కకు ప్రస్తుతం సర్వే చేస్తున్న లెక్కతో పోల్చితే 2.12 లక్షల మంది రైతుల పేర్లు గల్లంతయ్యాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వీరంతా ఎక్కడకు పోయారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ 4.24 లక్షల మందిలో కూడా ఇంకెంత మందికి కోత పెడతారోననే చర్చ జరుగుతున్నది.

ఎట్టకేలకు వైద్యశాఖలో చలనం!

- సీజనల్ వ్యాధులపై వైద్యాధికారుల క్షేత్రస్థాయి పర్యటన
- విపక్షం హెచ్చరికలు .. సీఎం వార్నింగ్ తర్వాత కదలిక

ఉస్మానియా దవాఖానను సందర్శిస్తున్న డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ రవీంద్రనాయక్, దవాఖాన ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ రాకేశ్ సహాయ్ తదితరులు

హైదరాబాద్, ఆగస్టు 28 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర వైద్యారోగ్యశాఖలో ఎట్టకేలకు కదలిక వచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా సీజనల్ వ్యాధులు విజృంభించినా పట్టించుకోని ఉన్నతాధికారులు సీఎం రేవంత్‌రెడ్డి హెచ్చరికతో మేల్కొన్నారు. 'ప్రజల ఆరోగ్య పరిరక్షణను పట్టించుకోని అధికారులను సస్పెండ్ చేస్తామని' సీఎం చెప్పడంతో హడావుడిగా దవాఖానల్లో పర్యటించి సదుపాయాలపై ఆరా తీశారు. రోగులతో మాట్లాడి సమీక్షలు చేశారు. సీజనల్ వ్యాధులు ప్రారంభంకాగానే ఈ పని చేసి ఉంటే.. పరిస్థితి ఈ స్థాయిలో ఉండేదికాదని వైద్య నిపుణులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. డెంగ్యూ, చికున్ గున్యా, విష జ్వరాలు ప్రభలుతున్నాయని, దవాఖానల్లో పడకలు, సిబ్బంది, మందులు సరిపోవడంలేదని వైద్య సిబ్బంది ఎంత మొత్తుకున్నా ఇన్నాళ్లూ ఉన్నతాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. సీజనల్ వ్యాధుల కట్టడికి సరైన కార్యాచరణ రూపొందించి, అమలు చేయడంలో విఫలం అయ్యారని వైద్యవర్గాలే పేర్కొంటున్నాయి. విషజ్వరాలు విజృంభణపై మీడియాలో వరుస కథనాలు వచ్చినా ఫలితం కనిపించలేదు. పరిస్థితి అదుపు తప్పడంతో మంగళవారం నిర్వహించిన సమీక్షలో ఆసుపత్రుల్లో పెరుగుతున్న కేసులపై సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే నివారణ చర్యలు చేపట్టాలని, పట్టణాలు, గ్రామాల్లో ఫాగింగ్, స్ప్రే ముమ్మరం చేయాలని అధికారులను ఆదేశించారు. వైద్యాధికారుల నిర్లక్ష్యాన్ని ప్రస్తావిస్తూ.. 'పని చేయని ఉద్యోగులను, ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం చేపట్టే చర్యలపై ఉదాసీనంగా వ్యవహరించే వారిని సస్పెండ్ చేస్తాం' అని హెచ్చరించారు. దీంతో హుటాహుటిన వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. అయితే.. సీజనల్ వ్యాధుల యాక్షన్ ప్లాన్‌కు నేతృత్వం వహించాల్సిన డీపీహెచ్ ఈ సమీక్షలో లేకపోవడం గమనార్హం. మంత్రి ఆదేశాల మేరకు వైద్యశాఖ ఉన్నతాధికారులు బుధవారం వివిధ దవాఖానలను పరిశీలించాలని హెల్త్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు బుధవారం డీపీహెచ్ రవీందర్ నాయక్ ఉస్మానియా దవాఖానకు, టీవీవీపీ కమిషనర్ అజయ్‌కుమార్ గాంధీ దవాఖానకు, డీఎంఈ వాణి కోఠి జిల్లా దవాఖానకు, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్వీ కర్ణన్ ఫీవర్ హాస్పిటల్‌ను సందర్శించారు. జ్వర కేసుల నమోదుపై ఆరా తీసి, దవాఖానల్లో వసతులు, పరికరాలు, మందుల నిల్వ వంటివి అడిగి తెలుసుకున్నారు. గురువారం హైదరాబాద్ శివారులోని దవాఖానల్లో వారు పర్యటించనున్నారు.

దవాఖానల్లో సరిపడా మందులున్నాయి

'నమస్తే తెలంగాణ' కథనానికి టీజీఎంఎస్ఐడీసీ ఎండీ వివరణ

హైదరాబాద్, ఆగస్టు 26 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ దవాఖానల్లో సరిపడా మందులు అందుబాటులో ఉన్నాయని వైద్యారోగ్యశాఖ తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా జ్వరాల పరిస్థితి, దవాఖానల్లో మందుల కొరతపై 'నమస్తే తెలంగాణ'లో మంగళవారం ప్రచురితమైన 'ఇంటికి ఇద్దరికి విషజ్వరం' కథనానికి టీజీఎంఎస్ఐడీసీ ఎండీ స్పందించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సెంట్రల్ మెడిసిన్ స్టోర్లలో(సీఎంఎస్) తగినన్ని ఔషధాలు నిల్వ ఉన్నట్టు తెలిపారు. నిత్యం దవాఖానలకు సరఫరా అవుతున్నట్టు వెల్లడించారు. డీఎంఈ, టీవీవీపీ పరిధిలోని దవాఖానలు కూడా సొంత నిధులతో కొన్ని రకాల ఔషధాలు కొనుగోలు చేస్తారని పేర్కొన్నారు. ఔషధాల సరఫరాదారులకు రూ.600 కోట్ల బిల్లులు పెండింగ్ ఉన్నాయనడం కూడా సరికాదని చెప్పారు. గతేడాది డిసెంబర్ నుంచి ఇప్పటివరకు రూ.213 కోట్ల బిల్లులు చెల్లించినట్టు స్పష్టంచేశారు.

జహీరాబాద్‌లో ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ

హైదరాబాద్, ఆగస్టు 28(నమస్తే తెలంగాణ): సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో కేంద్ర ప్రభుత్వం ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీని ఏర్పాటు చేయనుంది. బుధవారం ఢిల్లీలో ప్రధాన మంత్రి మోదీ అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాల మంత్రివర్గ కమిటీ(సీసీఈఏ) ఇందుకు ఆమోదం తెలిపింది. జాతీయ పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా రూ.28,602 కోట్లతో దేశవ్యాప్తంగా 10 రాష్ట్రాల్లో 12 పారిశ్రామిక స్మార్ట్ సిటీలను ఏర్పాటు చేయాలని కేంద్రం నిర్ణయించింది. ఇందులో భాగంగా రూ.2,361 కోట్లతో జహీరాబాద్‌లో పారి శ్రామిక స్మార్ట్ సిటీ ఏర్పాటు కానుంది. . రెండు దశల్లో దాదాపు 12,500 ఎకరాల విస్తీర్ణంలో ఈ ప్రాజెక్టు విస్తరించనుంది.

కేంద్ర మంత్రివర్గ నిర్ణయాలు

- రూ.6,456 కోట్ల వ్యయంతో ఒడిశా, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, ఛత్తీస్‌గఢ్‌లో రెండు కొత్త రైల్వే లైన్లు, ఒక మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టు
- ప్రైవేటు ఎఫ్ఎం రేడియా ఫేజ్-3 పాలసీలో భాగంగా 234 కొత్త నగరాల్లో 730 ఎఫ్ఎం చానళ్ల కోసం ఈ-వేలం నిర్వహణ
- ఈశాన్య రాష్ట్రాల్లో రూ.4,136 కోట్లతో 15,000 మెగావాట్ల సామర్థ్యం కలిగిన జలవిద్యుత్తు కేంద్రాల నిర్మాణం

ఆదిలాబాద్‌లో ఆందోళన చేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

కలెక్టరేట్ల ఎదుట ఉద్యోగుల నిరసన దీక్ష

హైదరాబాద్, ఆగస్టు 28 (నమస్తే తెలంగాణ): రెగ్యులర్‌తోపాటు మినిమం టైంస్కేల్ అమలుచేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కేంద్రాల్లో సమగ్ర శిక్షా ఉద్యోగులు భారీ ర్యాలీలు నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ల ఎదుట నిరసన దీక్షలు చేపట్టారు. సిద్దిపేటలోని నిరసన దీక్షలో పాల్గొన్న సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుండిగల్ యాదగిరి మాట్లాడుతూ.. నిరుడు సెప్టెంబర్‌లో హనుమకొండలో సమ్మె చేస్తున్న సందర్భంగా టీపీసీసీ హోదాలో రేవంత్‌రెడ్డి తమ వద్దకు వచ్చి, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన 30 రోజుల్లో సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని, బేసిక్ పే అమలు చేస్తామని చెప్పారని గుర్తు చేశారు. నాడు ఇచ్చిన హామీని అమలుచేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలలకాలంలో అనేకసార్లు కలిసి న్యాయం చేయాలని వినతిపత్రాలు ఇచ్చినా స్పందించడం లేదని వాపోయారు. ఇప్పటికే 169 మంది ఉద్యోగులు వివిధ కారణాలతో ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తంచేశారు.

విద్యాశాఖ డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న జాక్ నేతలు

ఎస్జీటీలకు హెచ్ఎంలుగా పదోన్నతి కల్పించాలి

ఉపాధ్యాయ జేఏసీ నేతల వినతి

హైదరాబాద్, ఆగస్టు 28 (నమస్తే తెలంగాణ): ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న, విద్యాపరంగా ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర టీచర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ డిమాండ్ చేసింది. బుధవారం విద్యాశాఖ డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డికి జాక్ నేతలు వినతిపత్రం సమర్పించారు. బీఈడీ/డీఈడీ అర్హత కలిగిన ఎస్జీటీ ఉపాధ్యాయులకు ప్రాథమిక పాఠశాల హెడ్ మాస్టర్లుగా ప్రమోషన్లు కల్పించాలని కోరారు. ప్రాథమిక పాఠశాలలకు పదివేల పీఎస్ హెడ్ మాస్టర్ పోస్టులను మంజూరు చేయాలని విన్నవించారు. ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించడంతోపాటు, స్కావెంజర్లను నియమించాలని డిమాండ్ చేశారు. పదోన్నతి పొందకుండా మిగిలిపోయిన 600 మంది పండితులను అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. మాడల్ స్కూళ్లలో ఔట్ సోర్సింగ్ ఫిజికల్ డైరెక్టర్లను కాంట్రాక్ట్ పద్ధతిలోకి మార్చాలని జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు.

• తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు

మూడు రోజులుగా తాగునీరు సరఫరా కాకపోవడాన్ని నిరసిస్తూ కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండల కేంద్రంలో ప్రధాన రహదారిపై మహిళలు బుధవారం ఖాళీ బిందెలతో ఆందోళనకు దిగారు. రాస్తారోకో చేశారు. – రామారెడ్డి

• ఎస్సారెస్పీ కాల్వకు నీరివ్వాలని ఆందోళన

ఎస్సారెస్పీ కాల్వ ద్వారా సాగు నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం మెగ్గయ్యగూడెం శివారులోని ఎస్సారెస్పీ కాలువ వద్ద ఆందోళన చేస్తున్న రైతులు. – చివ్వెంల

లైంగిక దాడి కేసులో 20 ఏండ్ల జైలు

బాలిక కుటుంబానికి 10 లక్షల పరిహారం

దేశంలోనే అత్యధిక జరిమానా

వరంగల్ లీగల్, ఆగస్టు 28: రెండోతరగతి చదువుతున్న బాలికపై లైంగిక దాడికి పాల్పడిన దుండగుడికి 20 ఏండ్ల కఠిన కారాగార శిక్ష, 20 వేల జరిమానా విధిస్తూ వరంగల్‌లోని ప్రత్యేక పోక్సో కోర్టు బుధవారం తీర్పు ప్రకటించింది. పోక్సో చట్టం కింద ఈ కేసులో బాధిత కుటుంబానికి ప్రభుత్వమే రూ.10 లక్షలను పరిహారంగా అందజేయాలని తీర్పు ప్రకటించి దేశంలో అత్యధిక పరిహారాన్ని ప్రకటించిన న్యాయమూర్తిగా మనీషా శ్రావణ్ నిలిచినట్టు పీపీ మోకీల సత్యనారాయణ తెలిపారు. రామన్నపేట పరిసరాల్లో 2019 ఫిబ్రవరి 5న చర్చికి వెళ్లిన ఏడేండ్ల చిన్నారిపై ఓ వ్యక్తి చాక్లెట్ కొనిస్తానని లైంగిక దాడికి పాల్పడ్డాడు. నేరం రుజువైందని భావించిన న్యాయస్థానం నిందితుడు ప్రభుచరణ్‌కు 20 ఏండ్ల జైలు శిక్ష, రూ. 20 వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పింది.

• యూరియా కోసం డీలర్ల నిరసన

మార్క్‌ఫెడ్ నుంచి తమకు యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం జనగామ కలెక్టరేట్ ఎదుట ఫర్టిలైజర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డీలర్లు ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషాకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు పజ్జూరి గోపయ్య, నీహెచ్ సదానందం తదితరులు పాల్గొన్నారు. – జనగామ చౌరస్తా

• 6 వేల పింఛన్ కోసం దివ్యాంగుల ధర్నా

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ.6 వేలు పింఛన్ ఇవ్వాలని, తమ సమస్యలను పరిష్కరించాలని బుధవారం ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట దివ్యాంగులు ధర్నా చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. –ఎదులాపురం

కరెంట్ షాక్‌తో చిరుత మృత్యువాత

కామారెడ్డి జిల్లాలో ఘటన

ఎల్లారెడ్డి, ఆగస్టు 28: అడవి పందుల బారి నుంచి పంటలను రక్షించుకునేందుకు ఏర్పాటు చేసిన విద్యుత్తు కంచెకు తగిలి ఓ చిరుత కరెంట్‌షాక్‌తో మృత్యువాత పడింది. ఈ ఘటన కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలం హాజీపూర్ పంచాయతీ పరిధిలోని కట్టకింది తండాలో మంగళవారం చోటు చేసుకొన్నది. అయితే సదరు రైతు దూప్య విషయం బయటకు రాకుండా తన పొలంలోనే చిరుత కళేబరాన్ని పాతిపెట్టాడు. విషయం తెలుసుకున్న అటవీ, పోలీస్ అధికారులు బుధవారం అక్కడికి వెళ్లి చిరుత కళేబరాన్ని వెలికితీశారు. సుమారు రెండేండ్ల వయస్సు ఉన్న ఆడ చిరుతగా గుర్తించారు. అక్కడే పశువైద్యాధికారి రవికుమార్ పోస్టుమార్టం పూర్తి చేశారు. అనంతరం అటవీ ప్రాంతంలో దహనం చేశారు. కేసు నమోదు చేసి రైతు దూప్యను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఫారెస్టు అధికారి ఓంకార్ తెలిపారు.